

భువనగిరిలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు



భువనగిరిలో బీఆర్‌ఎస్ ధర్నా చేయాలనుకున్న అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఏర్పాటు చేసిన కంచె



భువనగిరిలో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పార్టీ నాయకులు

# భువనగిరి నిర్బంధం



తోపులాటలో కాలికి గాయం కాగా చికిత్స చేయించుకుంటున్న బీఆర్‌ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి



బీఆర్‌ఎస్ బీబీనగర్ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డిని అరెస్ట్ చేసి, బలవంతంగా బీబీనగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు



భువనగిరి వినాయక చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకుడిని కారులో ఎక్కించకుండా రోడ్డుపైనే ఈడ్చుకెళ్తున్న పోలీసులు

మొదటిపేజీ తరువాయి...

మహాధర్నాకు పిలుపునిచ్చింది. ఉదయం నుంచే పోలీసులు మహాధర్నా నిర్వహించే ప్రదేశాన్ని ఆధీనంలోకి తీసుకున్నారు. భారీ సంఖ్యలో బలగాలను మోహరించారు. వినాయక చౌరస్తా చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. జూనియర్ కాలేజీ, ప్రిన్స్ కార్నర్ జగదేవ్‌పూర్ చౌరస్తా, బస్టాండ్‌తో పాటు పట్టణంలోని చాలాచోట్ల ఆంక్షలు విధించారు. భువనగిరి చుట్టూ చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. పట్టణంలోకి రావాలంటే మూడెంచల భద్రతను దాటాల్సిన దుస్థితి కల్పించారు. ప్రతీ ఒక్కరినీ తనిఖీ చేసిన తర్వాతనే పట్టణంలోకి అనుమతించారు. పండుగ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

### అరెస్టులు.. ఆంక్షలు.. నిర్బంధాలు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని మండలాల బీఆర్‌ఎస్ నేతలతోపాటు హైదరాబాద్‌లో ఉంటున్న కీలక నేతలను గృహనిర్బంధం చేశారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఘట్‌కేసర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. నాగోల్‌లో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డిని గృహనిర్బంధం చేశారు. రామన్నపేటలో రాజ్యసభ మాజీ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, బీబీనగర్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ వనస్థలిపురంలో బీఆర్‌ఎస్ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ క్యామ మల్లేశ్‌ను, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, ఆలేరు మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్, నల్లగొండలో మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్, యాదగిరిగుట్టలో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిని గృహనిర్బంధం చేశారు. మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావును భువనగిరిలో అదుపులోకి తీసుకున్నారు. యాదాద్రి జడ్పీ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు.



నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు



నార్కట్‌పల్లిలో చిరుమర్తి లింగయ్యను గృహనిర్బంధం చేసిన పోలీసులు

### హోరెత్తిన బీఆర్‌ఎస్ ఆందోళనలు

శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి భువనగిరిలోని జూనియర్ కాలేజీ ముందు ప్రధాన రహదారిపై బైఠాయించారు. వివేకానంద జయంతిలో పాల్గొనేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి రాగా ఆయన వెంట ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు కేసీఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బీఆర్‌ఎస్ నేతలు సీఎం రేవంత్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పైళ్ల శేఖర్‌రెడ్డిని హైదరాబాద్ వనస్థలిపురం పీఎస్‌కు, కర్నె ప్రభాకర్‌ను బీబీనగర్ పీఎస్‌కు తరలించారు. వినాయకచౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ నేతలు వెంకటేశ్వర్ రెడ్డి, సందీప్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి ఆందోళనకు దిగారు. ప్రిన్స్ కార్నర్ వద్ద కూడా బీఆర్‌ఎస్ బృందం ఆందోళన నిర్వహించింది. ఆందోళనకారులను అరెస్టు చేసి, బలవంతంగా వ్యాన్లలో ఎక్కించి స్టేషన్లకు తరలించారు.

### బీఆర్‌ఎస్ నేతలపైనే కేసులు!

యాదాద్రి భువనగిరి, జనవరి 12 (నమస్తే తెలంగాణ): యాదాద్రి భువనగిరి జిల్లాలో బీఆర్‌ఎస్ నేతలపై పోలీసులు రివర్స్‌లో కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై శనివారం యూత్ కాంగ్రెస్ నేతలు దాడి చేసిన విషయం విదితమే. ఆ దాడిని నిరసిస్తూ భువనగిరిలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. దీంతో పలువురు నేతలపై కేసులు పెట్టారు. బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిపై కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



భువనగిరిలో మాజీ జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు



యాదగిరిగుట్టలో అరెస్ట్ చేయడానికి వచ్చిన పోలీసులతో వాగ్వాదానికి దిగుతున్న ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి



యాదాద్రి జిల్లా రామన్నపేట పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు

## ప్రశ్నిస్తే అరెస్టులు నిరంకుశానికి నిదర్శనం

**మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి**



హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు చేయడం హేయమైన చర్య అని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు.

## ఇందిరమ్మ రాజ్యమంటే దాడులేనా?

**మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్**



ఎల్కతుర్తి, జనవరి 12 : ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రతిపక్ష పార్టీ కార్యాలయంపై దాడులు చేయడమేనా? అని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ మండిపడ్డారు. ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని కోరారు.

# హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?

- దాడులను ఎట్టిపరిస్థితిలో సహించం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- నిరసన తెలిపేందుకు వెళ్తుండగా జగదీశ్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసులు

ఘట్‌కేసర్, జనవరి 12 : అధికారం కోసం మోసపూరిత హామీలు ఇచ్చి, ఇప్పుడు అమలుచేయమంటే సమాధానం చెప్పలేక కాంగ్రెస్ ప్రభుత్వం దాడులకు పాల్పడుతున్నదని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలో బీఆర్‌ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని నిరసిస్తూ ఆదివారం చేపట్టిన బంద్‌లో పాల్గొని నిరసన తెలిపేందుకు వెళ్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తాలో పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నట్టు ఆరోపించారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క గ్యారెంటీని అమలుచేయలేదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తున్నందుకు తమ కార్యాలయాలపై దాడులకు పాల్పడమేంటని ప్రశ్నించారు. దాడులు చేస్తే ఊరుకునేది లేదని, ఆరు గ్యారెంటీలను అమలుచేసే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, బీఆర్‌ఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు అమరేందర్, జిల్లా నాయకులు కరుణాకర్‌రెడ్డి, రాజయ్య, రాంరెడ్డి, బద్దూనాయక్, రమేశ్, చింతల కృష్ణ, శివశంకర్ ఉన్నారు.



ఘట్‌కేసర్ పోలీసుల నిర్బంధంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు

### కాంగ్రెస్ గూండాలకు రాచమర్యాదలా?

కాంగ్రెస్ గూండాలకు పోలీస్ వాహనంలో కూర్చోబెట్టి రాచమర్యాదలు చేస్తారా? అని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కేటీఆర్ ఏసీబీ కార్యాలయం బయట మీడియాతో మాట్లాడితేనే శాంతిభద్రతల కేసు పెట్టిన పోలీసులు.. బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేసిన గూండాలను పోలీస్ వాహనం ముందు సీట్లో కూర్చోబెట్టి సెల్ఫీలు తీసుకునేందుకు అవకాశం ఇస్తారా? అని నిలదీశారు. రాచమర్యాదలతో ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో దించుతారా? అని ధ్వజమెత్తారు. ఇదేనా పోలీసుల తీరు? అని రాచకొండ సీపీని ప్రశ్నించారు.

### బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు, విడుదల

బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంపై దాడిని నిరసిస్తూ భువనగిరికి బయల్దేరిన పార్టీ నాయకులను ఘట్‌కేసర్‌లోని యంనంపేట్ చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలించి సాయంత్రం వదిలిపెట్టారు. మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్‌గౌడ్, మేడ్చల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎండీ సిరాజ్, కౌన్సిలర్ బండారి ఆంజనేయులును ముందస్తు అరెస్టుచేశారు.

## అసమర్థుల ఆఖరి అస్త్రమే హింస: ఎర్రోళ్ల



హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో విధ్వంస పాలన సాగుతున్నదని, అసమర్థుల ఆఖరి అస్త్రమే హింస అని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ఎర్రోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రశ్నిస్తే నిర్బంధాలు, అరెస్టులు, దాడులు కొనసాగుతున్నాయని దుయ్యబట్టారు. గత పదేండ్లు ప్రశాంతంగా ఉన్న రాష్ట్రం కాంగ్రెస్ పుణ్యమా అని విధ్వంసం రాజ్యమేలుతుందని ఆవేదన వ్యక్తంచేశారు.

## రాష్ట్రంలో పోలీసుల కనుసన్నల్లో పాలన

**తుంగబాలు మండిపాటు**



రాష్ట్రంలో పోలీసుల కనుసన్నల్లో పాలన సాగుతున్నదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల దాడి సందర్భంగా పోలీసులు ప్రదర్శించిన ప్రేక్షకపాత్రే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

# దాడులకు పాల్పడితే ప్రతిదాడులు

**కాంగ్రెస్ బెదిరింపులకు భయపడం : దాస్యం వినయ్‌భాస్కర్**



హనుమకొండ, జనవరి 12: బీఆర్‌ఎస్ శ్రేణులు, పార్టీ కార్యాలయాలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడితే ప్రతిదాడులు చేస్తామని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హెచ్చరించారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ మూకల దాడిని తీవ్రంగా ఖండించారు. పార్టీలు ఏవైనా, వాటి కార్యాలయాలు ఆయా పార్టీలకు పవిత్ర దేవాలయాలవంటివని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్‌లో 60 లక్షల మంది గులాబీ సైనికులున్నారని చెప్పారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శాంతియుత మార్గాన్ని సూచించారని, అదే మార్గంలో రాష్ట్రాన్ని సాధించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్‌ఎస్ నిలదీస్తుంటే కక్షపూరితంగా ప్రతీకారచర్యలకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# ప్రజాస్వామ్యం ఖూనీ

**బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి మల్లేశ్**

రంగారెడ్డి, జనవరి 12 (నమస్తేతెలంగాణ) : కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదని బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాదాద్రి భువనగిరి జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి అత్యంత హేయమైన చర్యగా పేర్కొన్నారు. దాడిని ఖండిస్తూ బీఆర్‌ఎస్ శ్రేణులు భువనగిరి జిల్లాలో నిరసన కార్యక్రమానికి పిలుపునివ్వగా పోలీసులు తమ పార్టీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడంపై ధ్వజమెత్తారు. క్యామ మల్లేశ్‌ను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి వనస్థలిపురం ఠాణాకు తరలించారు.



మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



క్యామ మల్లేశ్

# రాష్ట్రంలో రాక్షసపాలన

- 420 హామీలు అమలు చేయని సీఎంపై 420 కేసు పెట్టాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



పెద్దపల్లి, జనవరి 12 : 'రాష్ట్రంలో నడుస్తున్నది రాజ్యాంగ పాలన కాదు.. రాక్షస పాలన.. కాంగ్రెస్ సర్కారు ప్రజాపాలన పేరుతో ప్రతీకార పాలన చేస్తున్నది.. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలని ప్రజల పక్షాన ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నిస్తే వారి గొంతు నొక్కి అక్రమ కేసులు పెడుతున్నది' అని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మండిపడ్డారు. శనివారం పెద్దపల్లికి వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్ ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ రాష్ట్ర ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ లోపాలను ఎత్తి చూపితే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు నమోదు చేయించి రాక్షసానందం పొందుతున్నారని దుయ్యబట్టారు. ఎన్ని కేసులు పెట్టినా బీఆర్‌ఎస్ నాయకులు, శ్రేణులు భయపడరని, ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తారని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు, బీఆర్‌ఎస్ కార్యాలయాలపై దాడులు చేయడం దారుణమని మండిపడ్డారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేయడానికి రేవంత్‌రెడ్డి గురుకులాలను నాశనం చేస్తున్నారని, గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనై పదుల సంఖ్యలో విద్యార్థులు చనిపోతున్నా దిద్దుబాటు చర్యలు చేపట్టకపోగా, కనీసం బాధిత కుటుంబాలను పరామర్శించలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కేతాను ముక్కలని, రేవంత్‌రెడ్డి (బీఎస్ఎఫ్) బండి సంజయ్ సెక్యూరిటీ ఫోర్స్‌గా, బండి సంజయ్ (ఆర్‌పీఎఫ్) రేవంత్‌రెడ్డి ప్రొటెక్షన్ ఫోర్స్‌గా మారారని ఆరోపించారు.

## ఏపీకి లాభం.. తెలంగాణకు నష్టం!

- రేవంత్‌రెడ్డి తీరుతో తరలుతున్న కంపెనీలు
- బీఆర్‌ఎస్ నేత క్రిశాంక్



హైదరాబాద్, జనవరి 11 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ తీరుతో ఏపీకి లాభం కలుగుతూ తెలంగాణకు నష్టం వాటిల్లుతున్నదని బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి క్రిశాంక్ విమర్శించారు. గ్రీన్ కో కంపెనీ విషయంలో కేటీఆర్‌పై నిరాధార ఆరోపణలు చేశారని ఆదివారం ఎక్స్ వేదికగా విమర్శించారు. గత ప్రభుత్వంలో గ్రీన్ కో కంపెనీ పేరిట మోసం చేసినట్టు ఆరోపించారని మండిపడ్డారు. అదే గ్రీన్ కో కంపెనీని ఏపీ డిప్యూటీ సీఎం స్వాగతించారని పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్ గ్రీన్ కోపై ప్రశంసలు కురిపిస్తున్న వీడియోను క్రిశాంక్ పోస్ట్ చేశారు.

# రాజ్యాంగేతర శక్తిగా రేవంత్ కుటుంబం!

- ప్రభుత్వ భవనాలకు ఏ హోదాలో తిరుపతిరెడ్డి భూమి పూజలు?
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నరు
- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుటుంబసభ్యులు రాజ్యాంగేతర శక్తులుగా మారి పెత్తనం చెలాయిస్తున్నారని, వికారాబాద్ జిల్లాలో రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి అధికారులు రాచమర్యాదలు ఎలా చేస్తారని బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రశ్నించారు. లగచర్ల ఘటన తర్వాత వికారాబాద్ కలెక్టర్ తన కార్యాలయం నుంచి బయటకు వచ్చి మరీ తిరుపతిరెడ్డికి స్వాగతం పలికారని, గతంలో ఇలాంటి ఘటనలు ఎప్పుడైనా జరిగాయా? అని నిలదీశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ నేతలు పంజుగుల శ్రీశైల్ రెడ్డి, కోట్ల మహిపాల్‌ముదిరాజ్, అనంతరెడ్డి, గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, పాండు తదితరులతో కలిసి మెతుకు ఆనంద్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. తిరుపతిరెడ్డికి ఏ పదవి ఉన్నదని కలెక్టర్ ప్రొటోకాల్‌ను ఉల్లంఘించి మర్యాదలు చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారుల సమక్షంలో స్కూల్ విద్యార్థులను ఎండలో నిలబెట్టి మరీ ఆయనకు స్వాగతం పలకడం ఏమిటని మండిపడ్డారు. ప్రభుత్వ భవనాలకు ఆయన ఏ హోదాలో భూమి పూజ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు కూడా ఆయనే పంచుతున్నారని తెలిపారు. వార్డు మెంబర్ కూడా కానటువంటి తిరుపతిరెడ్డికి దక్కుతున్న ప్రొటోకాల్ ఏం సందేశం ఇస్తున్నదని నిలదీశారు. తిరుపతిరెడ్డికి దక్కుతున్న ప్రభుత్వ మర్యాదలే ప్రజాస్వామ్యమా? ఇదేనా రేవంత్‌రెడ్డి ఏడో గ్యారెంటీ? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఖూనీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయిరెడ్డి ఆత్మహత్యకు కారకుడైన తిరుపతిరెడ్డిపై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు కాలేదని నిలదీశారు. దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఆయన ఇల్లు ఎందుకు కూల్చడం లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను ప్రశ్నించారు. కొండారెడ్డిపల్లిలో రేవంత్‌రెడ్డి ఇల్లు కూడా బఫర్‌జోన్‌లోనే ఉన్నదని ఆరోపించారు.



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మెతుకు ఆనంద్, శ్రీశైల్‌రెడ్డి

### గూండాలను తయారు చేస్తున్నరు: శ్రీశైల్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి నియోజకవర్గానికి వంద మంది కాంగ్రెస్ గూండాలను తయారు చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేత పంజుగుల శ్రీశైల్ రెడ్డి ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంపై పోలీసుల సమక్షంలో కాంగ్రెస్ గూండాలు దాడి చేశారని, గూండాలను ఆపాల్సిన పోలీసులు వీడియోలు తీస్తూ చోద్యం చూశారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి గూండాలను ప్రోత్సహిస్తుంటే తిరుపతిరెడ్డి అరాచకాలు పెరగక ఏమవుతాయని ప్రశ్నించారు.

## కేసీఆర్ హయాంలోనే సోలార్ పవర్

- సర్కారు పాఠశాలల్లో ఏర్పాటు..
- పాతపనులకు కొత్త కలరింగ్ కాంగ్రెస్ భావదారిద్ర్యానికి పరాకాష్ట
- బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 12 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ హయాంలోనే ప్రభుత్వ పాఠశాల ల్లో సోలార్ విద్యుత్ ఏ ర్పాటుచేసినట్టు రెడ్‌కో మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి అబద్ధాలు మాట్లాడటమే విధానంగా మారిందని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 1521స్కూళ్లలో 33 కోట్లతో సోలార్ విద్యు త్ ప్లాంట్లు ఏర్పాటుచేసిందని, ఆ పనులు పూర్తయ్యాయని వివరించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన పథకాన్ని తమ పథకంగా ప్రచారం చేసుకోవడం కాంగ్రె స్ ప్రభుత్వ భావదారిద్ర్యానికి నిదర్శనమని విమర్శించారు.